




# వార్త మిర్రర్
తెలుగు దినపత్రిక

సోమవారం,
ఫిబ్రవరి 16, 2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-




## సేవా ధోరణే
# మా పాలనకు ప్రాణం: సీఎం రేవంత్

- 'నేనే రాజు.. నేనే మంత్రి' వ్యాఖ్యలపై వివరణ ఇచ్చిన సీఎం
- మున్సిపల్ ఎన్నికల ఫలితాలకు తానే బాధ్యత వహిస్తానని స్పష్టం
- లంబాడా సమాజం అండతో సీఎం హోదా సాధ్యమైందని వ్యాఖ్య
- వెనుకబడిన వర్గాల భాగస్వామ్యమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి
- పేదల సంక్షేమం, విద్య, తండాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- సేవాలాల్ జయంతి వేడుకల్లో సేవా భావాన్ని ఉద్ఘాటించిన సీఎం

హైదరాబాద్: బంజారాహిల్స్‌లోని బంజారా భవన్‌లో నిర్వహించిన సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొని రాష్ట్ర ప్రజలకు తాము పాలకులు కాదని, సేవకులమేనని స్పష్టం చేశారు. ప్రజలకు సేవ చేయడానికే అధికారాన్ని ఇచ్చారని, తాను ఎప్పుడూ అధికార ధోరణితో వ్యవహరించలేదన్నారు. ఇటీవల తాను చేసిన 'నేనే రాజు.. నేనే మంత్రి' వ్యాఖ్యలను కొందరు వక్రీకరించారని, వాస్తవానికి మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ గెలుపోటములకు తానే పూర్తి బాధ్యత వహిస్తానని చెప్పే సందర్భంలో ఆ మాటలు చెప్పానని వివరించారు. ఎన్నికల ఫలితాలు తన పనితీరుకు ప్రమాణంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహారాజ్ శాంతి, సామరస్యాలకు ప్రతీకగా నిలిచిన మహనీయుడని

(మిగతా 2వ పేజీలో)

# అధికార కాంగ్రెస్ అక్రమాలకు పాల్పడతుంది: కేటీఆర్

- పోలీసుల సహకారంతో ప్రతిపక్షంపై దౌర్జన్యాలు జరిగాయని వ్యాఖ్య
- దొడ్డిదారిలో గెలుపు సాధించాలనే కుట్రలున్నాయన్న విమర్శ
- సింగరేణి రక్షణకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం
- గిరిజనుల సంక్షేమంలో కేసీఆర్ పాలనకే కీర్తి అంటూ వ్యాఖ్యలు
- సేవాలాల్ జయంతి వేడుకల్లో బీఆర్ఎస్ ధోరణిని వెల్లడించిన కేటీఆర్



హైదరాబాద్ : మున్సిపల్ పోలింగ్ సందర్భంగా అధికార కాంగ్రెస్ పార్టీ అక్రమాలకు పాల్పడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. పోలీసుల మద్దతుతో ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యాలకు దిగినట్లు విమర్శించారు. ప్రజాస్వామ్య విధానాలను పక్కనబెట్టి దొడ్డిదారిలో గెలుపు సాధించేందుకు కాంగ్రెస్ కుట్రలు పన్నుతోందని ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న కేటీఆర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా జరగాల్సిన సమయంలో అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. ప్రతిపక్షాన్ని అణగదొక్కడమే లక్ష్యంగా రాజకీయంగా ఒత్తిళ్లు తీసుకువస్తున్నారని ఆరోపించారు. అయినప్పటికీ ప్రజల మద్దతుతో బీఆర్ఎస్ బలంగా నిలుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. సింగరేణి రక్షణ విషయంలో ఎవరూ ముందుకు రాకపోయినా తమ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తోందని కేటీఆర్ స్పష్టం చేశారు. కార్మికుల హక్కులు, ప్రాంతీయ ప్రయోజనాల పరిరక్షణలో బీఆర్ఎస్ ఎప్పుడూ రాజీపడదని తెలిపారు. ప్రజా సమస్యలపై తమ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని పేర్కొన్నారు. గిరిజనుల సంక్షేమానికి గతంలో జరిగిన కృషిని గుర్తుచేసిన కేటీఆర్, కేసీఆర్ పదేళ్ల పాలనలోనే గిరిబిడ్డలకు న్యాయం జరిగిందన్నారు. 'మా తండాల్లో మా రాజ్యం' అనే

(మిగతా 2వ పేజీలో)



## బంజారాల హామీల్లో కాంగ్రెస్ విఫలం: కవిత

- బంజారా, ఆదివాసీ హక్కులపై ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకున్న కవిత
- జిఓ 33 ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్
- సేవాలాల్ జయంతి వేడుకల్లో ఘాటైన వ్యాఖ్యలు
- గోర్ భోళి భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చాలని విజ్ఞప్తి



## బ్రిటన్‌తో వాణిజ్య ఒప్పందం ఏప్రిల్ నుంచి అమల్లోకి

## రాహుల్ చెప్పేవన్నీ అసత్యాలు

- హోం మంత్రి అమిత్ షా విమర్శ
- బహిరంగ చర్చకు రావాలంటూ సవాల్



# ట్రైబల్ వర్సిటీతో ఉన్నత విద్యావకాశాలు

- మోదీ ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి ప్రత్యేక కార్యక్రమాలు
- సేవాలాల్ స్ఫూర్తి భాజపా సిద్ధాంతాలకు సమీపమని పేర్కొన్నారు
- తండాల అభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని విమర్శ
- సేవాలాల్ జయంతి వేడుకల్లో భాజపా నేతల నివాళులు
- ప్రకృతి పరిరక్షణకు సేవాలాల్ జీవితం అంకితం అని కొనియాడిన నేత



హైదరాబాద్: దేశవ్యాప్తంగా గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు తెలిపారు. ములుగు ప్రాంతంలో సమ్మక్క-సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ స్థాపనతో గిరిజన ప్రాంతాల్లో ఉన్నత విద్యకు కొత్త అవకాశాలు ఏర్పడ్డాయని ఆయన పేర్కొన్నారు. విద్య, అభివృద్ధి రంగాల్లో గిరిజన యువతకు మరింత ప్రోత్సాహం లభించేలా కేంద్రం (మిగతా 2వ పేజీలో)



# టీ20 వరల్డ్‌కప్‌లో పాక్‌పై భారత్ ఘన విజయం

- 61 పరుగులతో పాకిస్తాన్‌పై టీమిండియా ఆధిపత్య గెలుపు
- ఇషాన్ కిషన్ మెరుపు ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌పై ముద్ర
- సమష్టి బౌలింగ్‌తో పాక్‌ను 114కే కట్టడి
- వరుసగా మూడో విజయంతో 'సూపర్8'కు భారత్ అర్హత

# శివ నామస్మరణతో హోరెత్తుతున్న శైవ క్షేత్రాలు

తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు




హైదరాబాద్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని శైవక్షేత్రాలు 'ఓం నమః శివాయ' నామస్మరణతో మార్మోగుతున్నాయి. ఆదివారం (ఫిబ్రవరి 15) తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తడంతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన శ్రీశైలం, వేములవాడ,

(మిగతా 2వ పేజీలో)

# మహాశివరాత్రి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు

# నిర్వహించిన కృష్ణ గోపాల్ సేవా సమితి

**మన్సురాబాద్ ఓల్డ్ ఏజ్ హోమ్ లో అన్నప్రసాద వితరణ.!**

**కర్మన్ ఘాట్ హనుమాన్ టెంపుల్ లో ప్రసాద వితరణ.!**

**ఆదరణ అనాధ ఆశ్రమంలో చిన్నారులకు అల్పాహార వితరణ.!**





కర్మన్ ఘాట్ వార్త మిర్రర్ ప్రతినిధి : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. కర్మన్ ఘట్ హనుమాన్ ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా వచ్చే భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆదరణ అనాధ ఆశ్రమంలో చిన్నారులకు అల్పాహారాన్ని అందించారు, మనసురాబాద్ ఓల్డ్ ఏజ్ హోమ్ లో అనాధ వృద్ధులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సేవ కార్యక్రమంలో కృష్ణ గోపాల్ సేవా సమితి అధ్యక్షులు కపిల్ కుమార్ అగర్వాల్, కార్యదర్శి సచిన్ అగర్వాల్, కోశాధికారి కుష్ అగర్వాల్, జాయింట్ సెక్రెటరీ మనోజ్ గుప్తా, సమితి సభ్యులు సర్దార్ పోర్చారం, సునీల్ ధారాడే, సురేష్ దవాలే, పాక సతీష్ యాదవ్, దామలపల్లి సునీల్, కుషాల్ గుప్తా, సంజయ్ తదితరులు పలు సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు





# బంజారాల హామీల్లో కాంగ్రెస్ విఫలం: కవిత

**బంజారా, ఆదివాసీ హక్కులపై ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకున్న కవిత**

**జిఓ 33 ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్**

**సేవాలాల్ జయంతి వేడుకల్లో ఘాటైన వ్యాఖ్యలు**

**గోర్ భోళి భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చాలని విజ్ఞప్తి**

**తండాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని సూచన**

**బంజారాలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగాలని ఆకాంక్ష**



బంజారాలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వారిని మోసం చేసిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. బంజారాలు, ఆదివాసీల అంశాల్లో ప్రస్తుత ప్రభుత్వం అనవసర వివాదాలు సృష్టిస్తున్నదని ఆమె ఆరోపించారు. జిఓ 33 ప్రకారం బంజారాలకు రిజర్వేషన్లు తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో నిర్వహించిన సంత్ సేవాలాల్ 287వ జయంతి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోగ్ బందార్ నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ సేవాలాల్ సందేశాలను ఆదర్శంగా తీసుకుని జాగృతి ముందుకు సాగుతోందని తెలిపారు. సేవాలాల్ మహారాజ్ కేవలం ఆధ్యాత్మిక గురువే కాకుండా గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. బంజారా సమాజ అభ్యున్నతి కోసం సేవాలాల్ చేసిన కృషి దేశవ్యాప్తంగా పాఠ్యాంశాల్లో ఉండాలని కవిత కోరారు. గోర్ భోళి భాషను తప్పనిసరిగా రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. తండాల్లో ఇప్పటికీ పేదరికం పూర్తిగా తగ్గలేదని, గతంలో ఎదురైన సామాజిక సమస్యలు తగ్గినా ఆర్థిక వెనుకబాటు కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదరిక నిర్మూలన కోసం ప్రత్యేక కార్యాచరణతో ప్రత్యేక నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు బంజారా శాఖలు ఏర్పాటు చేస్తున్నప్పటికీ, తెలంగాణ జాగృతి మాత్రం ప్రధాన నిర్మాణంలోనే బంజారా బిడ్డకు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అవకాశం కల్పించిందని తెలిపారు. వెనుకబడిన వర్గాలను ముందుకు తీసుకురావాలన్న సంకల్పంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. సేవాలాల్ స్వాభిమానం, సామాజిక న్యాయం కోసం పోరాడిన మహానుభావుడని, ఆయన స్ఫూర్తితో బంజారాలు అన్ని రంగాల్లో ఎదగాలని ఆకాంక్షించారు. రాజకీయాల్లో కూడా బంజారా వర్గానికి తగిన ప్రాతినిధ్యం రావాలని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 'మన తండాల్లో మన రాజ్యం' అనే లక్ష్యంతో ముందుకు సాగామని తెలిపారు. యువత తండాల అభివృద్ధికి నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల్లో యువకులు ముందుకు రావాలని, గ్రామాల్లోనే ఉండి ప్రజా నాయకత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. తండాలను గ్రామపంచాయితీలుగా మార్చినా అవసరమైన మౌలిక వసతులు ఇంకా సరైన స్థాయిలో లేవని అన్నారు. ఈ పరిస్థితి మారాలంటే ప్రతి తండాకు రూ.25 లక్షల ప్రత్యేక నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరారు. రాష్ట్రంలో తమ పార్టీ గెలిచిన మున్సిపల్ సీటును కూడా కాంగ్రెస్ లాక్కుందని మండిపడ్డారు. ప్రతిపక్షం ఉండకూడదా అనే పరిస్థితి నెలకొల్పుతున్నారని విమర్శించారు. ఇటువంటి రాజకీయాలకు ప్రజలు తగిన సమాధానం ఇస్తారని హెచ్చరించారు. సేవాలాల్ జయంతి, మహాశివరాత్రి సందర్భంగా ప్రజలకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

# మేయర్ పీఠం ఎవరిది? కరీంనగర్‌లో రసవత్తరంగా మారిన రాజకీయం

**కరీంనగర్ కార్పొరేషన్‌లో రసవత్తరంగా మారిన మేయర్ ఎన్నిక**

**కాంగ్రెస్ పార్టీలో చేరిన ఐదుగురు స్వతంత్ర, ఇతర పార్టీల కార్పొరేటర్లు**

**కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించిన ఎంఐఎం, మరో స్వతంత్ర కార్పొరేటర్**

**అతిపెద్ద పార్టీగా బీజేపీ.. మేయర్ పీఠానికి అవసరమైన బలానికి దూరం**

**మంత్రుల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కొత్త కార్పొరేటర్లు**




కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, మేయర్ పీఠం ఎవరికి దక్కుతుందనే దానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. పలువురు స్వతంత్ర, ఇతర పార్టీల కార్పొరేటర్లు కాంగ్రెస్‌కు మద్దతు పలకడంతో రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు సాయిజ్యోతి, శ్యామలతో పాటు, స్వతంత్రులుగా గెలిచిన కొమరయ్య, నందిని ఉదయ్, మల్లేశం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మొత్తంగా ఐదుగురు కార్పొరేటర్లు హస్తం గూటికి చేరారు. హైదరాబాద్‌లో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. ఇదే సమయంలో, ఎంఐఎంకు చెందిన ముగ్గురు కార్పొరేటర్లతో పాటు, మరో స్వతంత్ర అభ్యర్థి మాజీద్ హుస్సేన్ కూడా కాంగ్రెస్ పార్టీకి తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. "కరీంనగర్ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని తాము బలంగా నమ్ముతున్నామని, అభివృద్ధిని ఆకాంక్షించే కాంగ్రెస్‌లో చేరామని" పార్టీలో చేరిన కార్పొరేటర్లు తెలిపారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 66 డివిజన్లకు ఎన్నికలు జరిగాయి. ఫలితాల ప్రకారం బీజేపీ 30 సీట్లు గెలుచుకుంది. కాంగ్రెస్ 14, బీఆర్ఎస్ 9 సీట్లు సాధించాయి. మిగిలిన సీట్లు ఇండిపెండెంట్లు, ఎఐఎఫ్‌బీ వంటి చిన్న పార్టీలు గెలుచుకున్నాయి. మొత్తం కార్పొరేషన్ బలం 69 (66 ఎన్నికైన సభ్యులు + 3 ఎక్స్‌అఫీషియో సభ్యులు). మేయర్ పదవికి అవసరమైన మెజారిటీ మార్క్ 35. తాజా పరిణామాలతో కాంగ్రెస్ బలం పెరిగింది. అతిపెద్ద పార్టీగా ఉన్నప్పటికీ బీజేపీకి మెజారిటీకి అవసరమైన సంఖ్యాబలం లేదు. దీంతో మేయర్ పీఠం కోసం పోరు హోరాహోరీగా మారింది. మిగిలిన స్వతంత్రులు, ఇతర పార్టీల మద్దతుతో ఎవరు అధికారాన్ని చేజిక్కించుకుంటారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.





## తాజ్ పూర్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ త్రిలింగేశ్వర స్వామి దేవాలయంలో ఘనంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం

**పూజలో పాల్గొన్న తాజ్ పూర్ గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష -శ్రీనివాస్**

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : భువనగిరి మండలం తాజ్ పూర్ గ్రామంలో గల శ్రీశ్రీశ్రీ త్రిలింగేశ్వర స్వామి దేవాలయంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పార్వతి పరమేశ్వరుడి కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవముగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాజ్ పూర్ గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష -శ్రీనివాస్, ఉప సర్పంచ్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాజ్ పూర్ సర్పంచ్, ఉప సర్పంచ్ ,గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## అధికార కాంగ్రెస్ అక్రమాలకు పాల్పడుతుంది: కేటీఆర్

నినాదాన్ని కార్యరూపంలోకి తీసుకొచ్చిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. కోయ, గిరిజన, లంబాడీ తండాలను గ్రామ పంచాయతీలుగా మార్పు చేసి స్థానిక స్వయంపాలనకు బాటలు వేసినట్లు వివరించారు. అలాగే వేలాది గిరిజన యువతకు సర్పంచులు, వార్డు సభ్యులుగా అవకాశాలు కల్పించామని, పోడు భూములకు పట్టాలు అందజేసి వారి జీవనోపాధికి భరోసా కల్పించామని చెప్పారు. సుమారు లక్షల ఎకరాల భూములకు హక్కులు ఇవ్వడం ద్వారా గిరిజన కుటుంబాలకు భద్రత కల్పించినట్లు తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్రానికి మరింత అభివృద్ధి కావాలంటే కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. గిరిజనులు, వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం బీఆర్ఎస్ చేపట్టిన కార్యక్రమాలను ప్రజలు గుర్తుంచుకుంటారని, ప్రజల ఆశీస్సులతో తిరిగి ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు.

## రాహుల్ చెప్పేవన్నీ అసత్యాలు

**హోం మంత్రి అమిత్ షా విమర్శ**

**బహిరంగ చర్చకు రావాలంటూ సవాల్**

గాంధీనగర్: అమెరికా, యూకే, ఈయూతో వాణిజ్య ఒప్పందాలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపణలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదివారం తీవ్రంగా ఖండించారు. రాహుల్ రైతులను తప్పుదోవ పట్టించడంతో పాటు అబద్ధాలను ప్రచారం చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఆయనకు చేతనైతే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. చర్చా వేదికను ఆయనే నిర్ణయించుకోవచ్చన్నారు. మన రైతులు, డెయిరీ ఉత్ప త్తులకు కేంద్రం పూర్తి రక్షణ కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. "వాణిజ్య ఒప్పందాలు మన రైతులకు హాని చేస్తాయన్న కాంగ్రెస్ ఆరోపణలు హాస్యాస్పదం. ప్రజలను తప్పుదోవపట్టించడంలో ఆ పార్టీ నేతలు సిద్ధహస్తులు. నిజానికి యూపీఏ హయాంలో కుదుర్చుకున్న పలు ఒప్పందాలు మన వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేలా ఉన్నాయి. వాటిలోని ప్రమాదకరమైన అంశాలను మోదీ ప్రభుత్వం రాగానే తొలగించింది" అని అమిత్ షా చెప్పారు.

## ట్రైబల్ వర్సిటీతో ఉన్నత విద్యావకాశాలు

పలు కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఎస్టీ మోర్చా అధ్యక్షుడు రవి నాయక్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ జీవితం, ఆలోచనలు భాజపా సిద్ధాంతాలకు ఎంతో సమీపంగా ఉన్నాయని అన్నారు. ప్రకృతి, పర్యావరణ పరిరక్షణకు సేవాలాల్ జీవితాంతం కృషి చేశారని రామచందర్‌రావు కొనియాడారు. బంజారా సమాజానికి ఆయన ఆరాధ్యదైవంగా నిలిచారని, ఆయన స్ఫూర్తితోనే గిరిజనుల సంక్షేమానికి మోదీ ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం విద్య, మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలుకు కేంద్రం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. అదే సమయంలో రాష్ట్రంలో గత భారాస, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు తండాల అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. గిరిజన ప్రాంతాల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్య ధోరణి కొనసాగుతోందని ఆరోపించారు. తండాల్లో మౌలిక సదుపాయాలు, విద్య, అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సంస్థాగత కార్యదర్శి చంద్రశేఖర్ తివారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్యాణ్ నాయక్ తదితర నాయకులు పాల్గొన్నారు. సేవాలాల్ మహారాజ్ ఆశయాలను అనుసరించి గిరిజన సమాజ అభ్యున్నతికి కృషి కొనసాగించాలని నేతలు పిలుపునిచ్చారు.



# సేవాలాల్ మహారాజ్ వాల్ పోస్టర్ ఆవిష్కరించిన - ఎమ్మెల్యే బిర్ల ఐలయ్య

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలు సందర్భంగ ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చేతుల మీదుగా సేవాలాల్ మహారాజ్ ఉత్సవ కమిటీ వాల్ పోస్టర్లు ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్య సంతోష్ నాయక్ మాట్లాడుతూ బంజారా జాతిని ఏకం చేసి తండాలుగా ఏర్పాటు చేసి మూఢనమ్మకాలు అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా మద్యపానానికి దూరంగా ఉండాలని జాతిని జాగృతం చేసి ఆరోగ్యం, విద్య వల్లి జీవితాలు మారుతాయి అని ప్రభావితం చేసినటువంటి గొప్ప సంఘసంస్కర్త సేవాలాల్ మహారాజ్ అట్టి మహనీయుని జన్మదిన వేడుకలను ప్రతి తండాలో మరియు మండల, జిల్లా వ్యాప్తంగా ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని పిలుపు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్య సంతోష్ నాయక్, రాష్ట్ర యువజన అధ్యక్షులు ధీరావత్ రవి నాయక్ యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్చార్జ్ శేఖర్ నాయక్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్ నాయక్, జిల్లా కార్యదర్శి రమేష్ నాయక్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు అరుణ్ నాయక్, జిల్లా సీనియర్ కార్యవర్గ సభ్యులు రాందాస్ నాయక్, తుర్కపల్లి మండల అధ్యక్షులు రమేష్ నాయక్, శ్రీను నాయక్, నరేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



## భిక్షపతి నగర్ శివాలయం లో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు....

మియాపూర్ వార్త మిర్రర్ :

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆఫీస్ పెట్ పరిధిలోని భిక్షపతి నగర్ శివాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాదాపూర్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బస్తి ప్రముఖులు బుజ్జన్న , నర్సింగ్ మరియు బస్తి వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శివుని కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.




## సేవాలాల్ జయంతి వేడుకలలో పాల్గొన్న బీ ఆర్ ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్....

మాదాపూర్ వార్త మిర్రర్ : బంజారా ఆరాధ్య దైవం సద్గురు శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి మహోత్సవాల సందర్భంగా మాదాపూర్ లో నీ చందా నాయక్ తండా లో లాలూ నాయక్ ఆధ్వర్యంలో ఆహ్వానం మేరకు నిర్వహించిన కార్యక్రమాల లో బీ ఆర్ ఎస్ పార్టీమాదాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్ని ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంత్ సేవాలాల్ మహారాజ్ సేవా తత్వం, సమానత్వ భావన, సామాజిక న్యాయం పట్ల ఆయన చూపిన మార్గాన్ని స్మరించుకుంటూ, సమాజ అభ్యున్నతి దిశగా ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమలో ఆహ్వానించి గౌరవించిన సేవాలాల్ అసోసియేషన్ ప్రతినిధులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు .ఈ కార్యక్రమంలో తాండవాసులు భక్తులు మరియు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సుక్క గణేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శివాలయం భక్తులకు పండ్ల పంపిణీ

సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఫిబ్రవరి 15 .. లాలాపేట్ డివిజన్ లో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం భక్తులు శివుడుని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దీంతో శివాలయాలు శివనామ స్మరణలతో మారుమోగాయి. శివుడికి రుద్రాభిషేకాలు తోపాటు ప్రత్యేక పూజలు చేశారు. బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ఫిలీం సెన్సార్ బోర్డు మెంబర్ సుక్క గణేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఇందిరానగర్ శివాలయంలో వందలాది మంది భక్తులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివుడి ఆశీస్సులతో లాలాపేట్ డివిజన్ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి పండుగ పర్వదినాన్ని పురస్కరించొని తాను వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మేకల సారంగపాణి, సుక్క గణేష్ ముదిరాజ్, బీజేపీ నాయకులు, వెంకటేష్ గౌడ్, కృష్ణమూర్తి, కరుణాకర్, రాము వర్మ, భాను, శ్రీకాంత్, దేవుడు కుమార్, గౌతమ్, వనమాల శ్రీను తదితరులు పాల్గొన్నారు. కాగా శివరాత్రి సందర్భంగా ఈ ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది.

# బి.ఆర్.ఎస్ నేత రవియాదవ్ కి మా సంపూర్ణ మద్దతు.. ముదిరాజ్ సంఘం నాయకులు..





శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గం పాపిరెడ్డి కాలనీ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సాయి నందన్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఐదు బస్తీల ముదిరాజ్ సంఘం నాయకులు ఆదివారం రోజు బిఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి ఉమ్మడి మూడు డివిజన్ ల ఇంచార్జ్ మారబోయిన రవియాదవ్ ని మసీద్ బండలోని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు ఈ వచ్చే కార్పొరేటర్ ఎలక్షన్ ల లో బిఆర్ఎస్ పార్టీకి గత పది సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి అభివృద్ధి పదంలో నడిపించిన కేసీఆర్ సార్ కి బిఆర్ఎస్ కి సపోర్ట్ చేసి గెలిపించుకుంటాం అని రాబోయే జిహెచ్ఎంసి ఎలక్షన్లలో టిఆర్ఎస్ పార్టీ నుండి కార్పొరేటర్ గా మారబోయిన రవియాదవ్ ని గెలిపించుకుంటామని తీర్మానం చేశారు. రవియాదవ్ కి ముదిరాజ్ ముద్దుబిడ్డ పోరాటయోధుడు పండుగ సాయన్న చిత్ర పటం ను బహుకరించారు. ఈ కార్యక్రమంలో సాయినందన్ ముదిరాజ్,కృష్ణ ముదిరాజ్, మల్లేష్ ముదిరాజ్, రాజు ముదిరాజ్, రాజ్ కుమార్ ముదిరాజ్, అంజయ్య ముదిరాజ్, సురేష్ ముదిరాజ్, మందుల మల్లేష్ ముదిరాజ్, నాగరాజు ముదిరాజ్, ఈశ్వరయ్య ముదిరాజ్, చంద్రయ్య ముదిరాజ్, నవనీత్ ముదిరాజ్, కార్తీక్ ముదిరాజ్, విజయ్ ముదిరాజ్, సాయి కిరణ్ ముదిరాజ్, రమేష్ ముదిరాజ్ అర్.హేమంత్ కుమార్ ముదిరాజ్, ధనుంజయ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కిష్టంపేట మార్కండేయ మందిరం లో ఘనంగా మహా శివరాత్రి ఉత్సవాలు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఫిబ్రవరి 15

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కిష్టంపేట లోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి, శ్రీ శివ భక్త మార్కండేయస్వామి, శ్రీ జ్ఞాన సరస్వతి మాత దేవాలయం లో మహా శివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. వందలాదిమంది భక్తులు తరలివచ్చి శివరాత్రి వేడుకల్లో పాల్గొని శివునికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి శివాలయం ముందు శివుని ఆశీస్సులు కోసం పెద్ద వరస లో నిలబడి, భక్తిశ్రద్ధలతో పూజలు చేసి శివుని ఆశీస్సులు పొందారు. ఉదయం స్వామివారికి అభిషేకము, మండపారాధన, హోమము, సాయంత్రం శివపార్వతుల కళ్యాణ మహోత్సవం, బలిహరణ, పల్లకి సేవ, అనంతరం సాయి భజన మండలి చే భజన కార్యక్రమం, రాత్రి: 12 గంటలకు లింగోద్భవము, గోగుపువ్వు బిల్వపత్ర, స్వామి వారికి అర్పించారు. ఈ కార్యక్రమం లో పద్మశాలి సేవా సంఘం కార్యవర్గం, సభ్యులు, గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# సేవాలాల్ మహారాజ్ బోధనలు యువత ఆచరించాలి

– సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

కల్వకుర్తి ఫిబ్రవరి 15 వార్త మిర్రర్ ప్రతినిధి:– సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలలో పాల్గొన్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆదివారం శ్రీ సంత్ సేవలాల్ మహారాజ్ 287వ జయంతిని పురస్కరించుకుని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆమనగల్, వెల్దండ పట్టణ కేంద్రాలలో గిరిజన సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహారాజ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ.. సేవాలాల్ మహారాజ్ గిరిజనుల ఆరాధ్య దైవమని, సమానత్వం, సేవాభావం, ధర్మం వంటి గొప్ప విలువలను సమాజానికి అందించిన మహనీయుడని పేర్కొన్నారు. బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చూపిన మార్గం నేటికీ ప్రేరణనిస్తోందని తెలిపారు. నేటి యువత సేవాలాల్ మహారాజ్ బోధనలను ఆచరణలో పెట్టి సమాజ సేవలో ముందుండాలని



పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులతో పాటు ఆయా మండలాల గిరిజన సంఘాల నాయకులు, జయంతి నిర్వహణ కమిటీ సభ్యులు మరియు గిరిజన సోదర సోదరీమణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ గ్రేటర్ ఆధ్వర్యంలోపండ్లు ప్రసాదం వితరణ:

దేవరకొండ ఫిబ్రవరి 15 వార్త మిర్రర్ వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ గ్రేటర్ దేవరకొండ ఆధ్వర్యంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఉదయం 6 గంటలకు అభిషేక కార్యక్రమం నిర్వహించి అనంతరం దేవాలయం విచ్చేసిన భక్తులకు పండ్లు ప్రసాదం వితరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరంగాజీ నగర్ రోడ్డులో గల శ్రీశ్రీశ్రీ ఉమామహేశ్వర స్వాముల దేవస్థానం మఠం బండ దేవాలయం లో కళ్యాణ మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దాతలుగా శ్రీ బండారు అశోక్ ధర్మపత్ని శ్రీమతి శోభా గురులు మండప నిర్మాణం అన్న ప్రసాద దాతలుగా ఆలయ ప్రధాన కార్యదర్శి శ్రీ పందిరి వెంకన్న ధర్మపత్ని జ్యోతి పట్టు వస్త్రాలు స్వాముల వారికి అందించి కళ్యాణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కళ్యాణ కార్యక్రమంలో అధ్యక్షులు సమడం జయరాములు కోశాధికారి మునిని వేణు ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ చేపూరి బ్రహ్మాచార్యులు ఉమామహేశ్వర కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవస్థానమునకు వచ్చిన భక్తులు పుస్తె మెట్టెలు తలంబ్రాలు స్వామివారికి అందజేసి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని అంగరంగ వైభవంగా జరిగిన అభిషేకం కార్యక్రమంలో నిమగ్నులై తీర్థ ప్రసాదం మహా అన్నదానం స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులైనారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కడారి అంజయ్య యాదవ్ సమ్మడం జయ రాములు ప్రధాన కార్యదర్శి పందిరి వెంకన్న జ్యోతి కోశాధికారి మునిని వేణు వాసవి క్లబ్ అధ్యక్షులు ఆతుకూరి ఆంజనేయులు వాసవి క్లబ్ కార్యదర్శి బెల్దే రవీందర్ వాసవి వనిత క్లబ్ ప్రధాన కార్యదర్శి బెజవాడ మల్లేశ్వరి




కోశాధికారి ఆలంపల్లి శిరీష వాసవి క్లబ్ డిస్టిక్ ఉప కోశాధికారి ఆలంపల్లి పద్మ వాసవి క్లబ్ జోన్ చైర్మన్ కొత్త సావిత్రి బండారు అశోక్ శోభా రాపోలు మల్లికా తదితరులు పాల్గొన్నారు

# ఎల్ బి నగర్ లో ఘనంగా బొమ్మ గోని ధర్మబక్షం 104వ జయంతి వేడుకలు

## కల్లుగీత కార్మికుల హక్కుల కోసం అఖిలభారత స్థాయిలో పోరాడిన మహనీయుడు

ఎల్ బి నగర్ వార్త మిర్రర్ ప్రతినిధి

ఎల్ బి నగర్ లో ఘనంగా మాజీ ఎంపీ బొమ్మ గోని ధర్మభిక్షం 104వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ "దున్నేవాడిదే భూమి అనే తరహాలోనే " గీసేవాడిదే చెట్టు" అనే నినాదంతో కల్లుగీత కార్మికుల హక్కుల కోసం అఖిల భారత స్థాయిలో పోరాడిన వ్యక్తి, గౌడ సామాజిక వర్గం, తెలంగాణ సమాజం గర్వించదగ్గ గొప్ప నాయకుడు, మాజీ ఎంపీ ధర్మ భిక్షం గౌడ్ అని తెలంగాణా రాజ్యాధికార పార్టీ ఎల్ బి నగర్ ఇంచార్జి, రంగా రెడ్డి జిల్లా అధికార ప్రతినిధి బొంగు వెంకటేష్ గౌడ్ తెలిపారు. పుట్టుక తనది బ్రతుకంత ప్రజలది అని ఎన్నికల్లో ఎప్పుడు ఓటమి ఎరుగని ప్రజా నాయకుడు బొమ్మగాని ధర్మభిక్షం అని తెలిపారు. నేడు 104 వ జయంతి సందర్భంగా ఈ రోజు ఉదయం 10గంటలకు ఎల్ బి నగర్ లో ధర్మబిక్షం ఫోటో కి నివాళులు అర్పిచారు. చేవగాని సైదులు గౌడ్, వేముల రమేష్ గౌడ్, కొండల గౌడ్, గిలికత్తుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గోన్నారు.



# వాసవి అన్నదాన సత్రాన్ని సందర్శించిన కల్వ సుజాత

కీసర, వార్త మిర్రర్, ఫిబ్రవరి 15: శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్పర్సన్ కల్వ సుజాత గుప్త స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ చైర్మన్ తటాకం వెంకటేషం శర్మ చైర్పర్సన్ కల్వ సుజాత గుప్త దంపతులను వేద పండితులు ఆశీర్వచనంతో సన్మానించారు. స్వామివారి దర్శనానంతరం శ్రీ వాసవి ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రంను తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్పర్సన్ శ్రీమతి కల్వ సుజాత గుప్త సందర్శించారు. సత్రం తరఫున సన్మానించారు. శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి సన్నిధి లో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ వాసవి ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రానికి కోబోయే కొండంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ గుప్త వారితో వచ్చిన కౌన్సిలర్స్ కు అధ్యక్షులు బెలిదే రమేష్ గుప్త, ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్ గుప్త,కన్వీనర్ రాయిల శ్రవణ్ కుమార్ గుప్త,ఉపాధ్యక్షులు నంగునూరి అశోక్ గుప్త, ప్రచార కమిటీ జులకంటి అశోక్ గుప్తాలు సన్మానించారు. యాత్రికుల కోసం వాసవి సత్రం చేస్తున్న సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి బచ్చు నగేష్ గుప్తా, కేదారేశ్వర గుప్తా, బల్లి శ్రీధర్ గుప్తా, సముద్రాల హరినాథ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



# సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జీవితం అందరికీ ఆదర్శం





సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఫిబ్రవరి 15 : బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఓయూ ఎస్సీ--ఎస్టీ సెల్ డైరెక్టర్ ప్రొ. డైసి ఆధ్వర్యంలో ఓయూ ఎన్‌సీసీ గేట్ నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు శోభాయాత్ర చేపట్టారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల సమీపంలో మహాభోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. నరేష్ రెడ్డి, విసికి ఓఎస్డీ ప్రొ. జితేందర్ కుమార్ నాయక్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ తన బోధనల ద్వారా బంజారా జాతి అభివృద్ధికి అపారంగా కృషి చేశారని పేర్కొన్నారు. తండాల నిర్మాణానికి తన జీవితాన్ని అంకితం చేసి, హింసా మార్గం మరియు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సమాజానికి ఉపదేశిస్తూ ఆదర్శప్రాయంగా నిలిచారని కొనియాడారు. బంజారా జాతిని చీకటి నుంచి వెలుగులోకి తీసుకొచ్చిన విప్లవ చైతన్యమూర్తిగా సంత్ సేవాలాల్ మహారాజ్ నిలిచారని, దేశం గర్వించదగ్గ గొప్ప ఆధ్యాత్మికవేత్తగా ఆయన సమాజ శ్రేయస్సు కోసం చూపిన మార్గం అందరికీ ఆదర్శనీయమని వక్తలు తెలిపారు. ఆయన బోధనల ఫలితంగా బంజారా సమాజం పురోగమించిందని, ఆయన ఆశయాలను కొనసాగించడం మనందరి బాధ్యత అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొ. మంగు నాయక్, అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ ప్రొ. లింగప్ప, ఎన్ఎస్-ఎస్ కోఆర్డినేటర్ ప్రొ. వెంకటేశ్వర్లు, ఈఈఈ విభాగాధిపతి ప్రొ. సుశీల, మైనారిటీ సెల్ డైరెక్టర్ ప్రొ. హమీదాబీ, ప్రొ. పద్మతో పాటు విద్యార్థి నాయకులు శరత్ నాయక్, సుబ్బు నాయక్, విజయ నాయక్, సంజయ్, ప్రవీణ్, వినోద్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రికి మరకత శివాలయాన్ని దర్శించుకున్న సుమారు లక్ష మంది భక్తులు

### స్వామివారి దర్శనానికి మూడు గంటల సమయం







శంకర్‌పల్లి: ఫిబ్రవరి 15: (వార్త మిర్రర్):



శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11 వ శతాబ్దానికి చెందిన మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం వేకువ జామున ఉదయం ఒంటిగంట నుంచి స్వామి వారిని దర్శించుకు నేందుకు పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఉదయం 6 గంటల వరకే అభిషేకాలకు అనుమతిని ఇచ్చారు. అనంతరం స్వామివారి దర్శనం కోసం భక్తులు క్యూ లైన్ లో బారులు తీరారు. గర్భాలయ దర్శనాలకు అనుమతించడంతో విడతలవారీగా దర్శనాల టిక్కెట్ల కోసం యాత్రికులు పోటీ పడ్డారు. దీంతో ఆలయ ప్రాంగణంలోని అన్ని క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. అదే విధంగా ఉచిత దర్శనానికి సుమారు మూడు గంటలకుపైగా సమయం పట్టింది. కళారాధన కార్యక్రమాల్లో చిన్నారులు చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్ తో పాటు వివిధ ప్రాంతాల నుంచి సుమారు లక్ష మందికి పైగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారని ఆలయ వర్గాలు తెలిపాయి. క్యూలైన్లలో ఉన్న భక్తులకు ఆలయ అధికారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగు నీరు, అల్పహారాన్ని అందించారు. చేవెళ్ల కోర్టు జడ్జి దంపతులు, దేశముఖ్ అనూష అవనందరెడ్డి, తహసిల్దారు సురేందర్ దంపతులు, సిఐలు శ్రీనివాస్ గౌడ్, సతీష్, క్రాంతి కుమార్ దంపతులు, రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీ జ్యోతి, భీమ్ భరత్, యాంకర్, వైయస్సార్ సిపి అధికార ప్రతినిధి శ్యామల, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తనయుడు విక్రం రెడ్డి స్వామి వారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. చేవెళ్ల, శంకర్‌పల్లి, నార్సింగ్ పోలీస్ స్టేషన్ ల నుండి 70 మంది పోలీసు సిబ్బంది ఆలయ ఆవరణలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు (వీడియో రావు), ప్రచార కమిటీ చైర్మన్ దయాకర రాజు స్వామి, చైర్మన్ గోపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ శేఖర్, కోశాధికారి జనార్దన్, అన్నదాన కమిటీ చైర్మన్ దర్శన్ గౌడ్, మాజీ చైర్మన్ సదానందం గౌడ్, డబ్బింగ్ ఆర్టిస్ట్, రైటర్ కృష్ణవేణి శఠకోపన్, సర్పంచ్ మల్లికార్జున్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

# ప్రజల్లో శాంతి స్ఫూర్తి నింపిన సేవాలాల్

– కిచ్చెన్నకు ఘన స్వాగతం పలికిన ఎస్టీలు



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 15 : మానవజాతి శాంతి మార్గంలో నడవాలని ప్రజల్లో స్ఫూర్తిని నింపిన మహనీయుడు సంత్ సేవాలాల్ అని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. మామిడిపల్లి గ్రామం రంగనాయకుల కాలనీలో నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో కిచ్చెన్న పాల్గొన్నారు. లంబాడీల ఆరాధ్యదైవం సేవాలాల్ జయంతిని సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అధికారికంగా నిర్వహించడం సంతోషమని అన్నారు. సేవాలాల్ గుడికి తన వంతు సహాయంతోపాటు... ప్రభుత్వంతో మాట్లాడి అనుమతులు ఇప్పించేందుకు కృషి చేస్తానని లక్ష్మారెడ్డి అన్నారు. అనంతరం మహేశ్వరం మండలం ఉప్పుగడ్డ తండాలో నిర్వహించిన సేవాలాల్ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. తండాలకు రోడ్లు, డ్రైనేజీ, పాఠశాలలు, మౌలిక వసతులు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కిచ్చెన్నగారు తెలిపారు.

## చైతన్యపురి మూచుకుందా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో బీఆర్ఎస్ యువజన నాయకుడు శివ ప్రకాష్ ప్రత్యేక పూజలు







శంకర్‌పల్లి: ఫిబ్రవరి 15: వార్త మిర్రర్:

మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం ఎల్బీనగర్ నియోజకవర్గంలోని చైతన్యపురి డివిజన్ లక్ష్మీనరసింహస్వామి కాలనీలో కొలువై ఉన్న శివాలయంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శివ ప్రకాష్ స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కాలనీ వాసులు, ఆలయ కమిటీ సభ్యులు శివప్రకాష్ ను స్వామివారి శేష వస్త్రంతో సత్కరించారు. ఈ సందర్భంగా శివ ప్రకాష్ మాట్లాడుతూ మహా శివరాత్రి అందరికీ శుభం కలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫణిగిరి కాలనీ ప్రెసిడెంట్ అజయ్ కుమార్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, చంద్రశేఖర్, రాహుల్ గౌడ్, కృష్ణారెడ్డి, కనకరాజు, శ్రీ హరి, తోట శ్రీనివాస్ యాదవ్, రవి యాదవ్, స్వామి, గన్ మాన్ శ్రీనివాస్, కనకరాజు,శ్రీహరి, నరేందర్ రెడ్డి, గౌరీ మేడం, రాకేష్, లక్ష్మణ్ గౌడ్, కళ్యాణ్, ప్రవీణ్, గణేష్ నాగరాజు, గానీ, హరీష్, జగదీష్, రాజు, మహేష్, సన్నీ, తరుణ్, పవన్, టోనీ, కాలనీ వాసులు పాల్గొన్నారు.



## శివగంగ రాజ రాజేశ్వరి ఆలయంలో పరమేశ్వరుడికి అభిషేకం నిర్వహించిన సబితా ఇంద్రారెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 15 : మహేశ్వరం నియోజకవర్గంలోని మహేశ్వరం మండలం, మహేశ్వరం గ్రామంలో గల శివగంగ రాజ రాజేశ్వరి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పరమేశ్వరుడికి ప్రత్యేక అభిషేక కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెతో పాటు పట్లోళ్ల యువకిశోరం కౌశిక్ రెడ్డి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహా శివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు ప్రజలందరికీ తెలియజేస్తూ, పరమేశ్వరుడి కృపాకటాక్షం ఎల్లవేళలా అందరిపై ఉండాలని, పాడిపంటలు సస్యశ్యామలంగా ఉండాలని దేవుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అలాగే సబితా ఇంద్రారెడ్డి అభిమానులు పాల్గొన్నారు.



## ఎలిమేటి రామ్ రెడ్డి మెమోరియల్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న దేప భాస్కర్ రెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 15 : మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ పరిధిలోని వై.ఏ.ఆర్ (వై ఎ ఆర్ ) కన్వెన్షన్ హాల్‌లో ఎలిమేటి రామ్ రెడ్డి మెమోరియల్ ఓపెన్ బాడీ బిల్డింగ్ అండ్ మెన్ ఫిజిక్ ఛాంపియన్‌షిప్ మరియు మిస్టర్ తెలంగాణ ఐకాన్ క్లాసిక్ 2026 పోటీలు టీపీసీసీ సెక్రటరీ కంటెస్టెంట్ ఎమ్మెల్యే ఎలిమేటి అమరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత క్రీడలు శారీరక దృఢత్వానికే కాకుండా క్రమశిక్షణకు మార్గదర్శకాలని కొనియాడారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండి ఇలాంటి క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఇంతటి భారీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న ఎలిమేటి అమరేందర్ రెడ్డి ని వారు అభినందించారు. అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేసి వారిని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ బండి మధుసూదన్ రావు, గోవర్ధన్ రెడ్డి మాజి కార్పొరేటర్ జైహింద్, జంగయ్య, అక్బర్, బాహాం,శ్రీధర్, నబీ, దినేష్ సింగ్, భాను,వరుణ్ మరియు తెలంగాణ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు క్రీడాభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## తార్నాక కు చేరుకున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి 32వ అఖండ జ్యోతి యాత్ర

సికింద్రాబాద్ ,వార్త మిర్రర్ ఫిబ్రవరి 15 : శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి 32వ అఖండ జ్యోతి యాత్ర ఆదివారం భక్తి శ్రద్ధల నడుమ బర్కత్‌పురం నుంచి ప్రారంభమై తార్నాక చౌరస్తాకు చేరుకుంది. యాత్ర సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులతో పాటు సన్మాన్ హోటల్ యజమాని విశ్వనాధరావు, సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే మేకల సారంగపాణి, బీజేపీ సీనియర్ నాయకుడు వెంకటేష్ గౌడ్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. స్వామివారి దీవెనలతో ప్రజలు సుఖశాంతులతో, ఐశ్వర్యసంపదలతో జీవించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కృష్ణమూర్తి, కరుణాకర్, రాము వర్మ, భాను, శ్రీకాంత్, దేవుడు కుమార్, గౌతమ్, వనమాల శ్రీను తదితరులు పాల్గొని అఖండ జ్యోతిని దర్శించుకున్నారు. యాత్ర మార్గమంతా భక్తి గీతాలు, జై నినాదాలతో ఆ ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది.



## మహా శివునికి ప్రత్యేక పూజలు చేసిన సామిడి గోపాల్ రెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 15 :మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా ప్రశాంతి హిల్స్ డివిజన్ 58 లో లెనిన్ నగర్, ప్రశాంతి హిల్స్, నందిహిల్స్, కాలోని లలో నెలకొన్న పరమేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన టీపీసీసీ తెలంగాణ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు సామిడి గోపాల్ రెడ్డి ఈసందర్భంగా గోపాల్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు అందరు అందులో మరి ముక్యంగా ప్రశాంతి హిల్స్ డివిజన్ ప్రజలు సుఖసంతోషాలతో ఆయువు ఆరోగ్య లతో అందరు ఉండాలి అందులో నేనూఉండాలని ఆ పరమేశ్వడుని వేడుకున్నానని తెలియజేసారు ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు